# కాపీరేపు

మల్లాది వెంకటకృష్ణమూర్తి



రచయితలంటే నాకో అభి ప్రాయముండేది.

వాళ్ళు చాలా సీరియస్‌గా వుంటారని, ఎదుటి వ్యక్తిని ఆసక్తిగా పరిశీలించి వాళ్ళ మీద కథలల్లుతారని. ప్రతీమాట తూచి తూచి జాగ్రత్తగా మాట్లాడుతారని, వీలు చిక్కినప్పుడల్లా పుస్తకాల పురుగు లవుతారని......

అంబాజీరావు అలా వుండడు. ప్రవర్తించడలా. అంబాజీరావు నా స్నేహితుడు. అంతేకాదు ప్రీ-యూనివర్సిటీ రోజులనుంచి నా క్లాస్‌మేట్.

బి.ఏ. రెండో సంవత్సరంలో తన చదువు ఆపేశాడు ఆర్థికమైన కారణాలవల్ల. ఎప్పుడైనా కాలేజీ మేగజైనుకంటూ కథలు వ్రాసి నాకు వినిపించినా, అంబాజీరావుని నే నెన్నడూ కథా రచయితగా పరిగణించలేదు, లేదా గుర్తించలేదు.

ఎప్పుడూ నవ్వుతూ, తృళ్ళుతూ సరదాగా తిరిగే అంబాజీరావు కథారచయిత అవుతాడని నే నెన్నడూ అనుకోలేదు. అలా అయాడని తెలిసిన రోజు నిజంగా అబ్బురపడ్డాను.

నాలా మంచి వుద్యోగం దొరక్క పోయినా, తను బ్రతకగలిగే చక్కని వుద్యోగం సంపాదించుకున్నాడు. తర్వాత హైద్రాబాద్‌లో నా రూమ్‌మేట్ అయాడు. పత్రికలు కొనే స్తోమత లేక, అద్దెకి తెచ్చి చదువుతూండేవాడు.

ప్రతీ ఆదివారం క్రమం తప్పకుండా ఒకటి రెండు కథలయినా వ్రాసి, ఆ వ్రాత ప్రతులని తోటి రచయితలకు చదివి వినిపించడానికి వుదయం పదకొండుకల్లా వంట చేసేసి, భోజనం ముగించి వెళ్ళిపోయేవాడు.

ఆ ఆదివారం నేనూ అంబాజీరావు వెంట వెళ్ళాను. చాలాసార్లు రమ్మని సరదాగా పిల్చినా ఆ ఆదివారం ఎప్పటిలా నిరాకరించకుండా వెళ్ళాను. జేబులో సినిమాకెళ్ళడానికి సరిపడ డబ్బులేక, ఎలా కాలాన్ని ఖర్చు పెట్టాలో తోచక వెళ్ళాను.

ఒక రచయిత ఇంటికి తీసుకెళ్ళి ఆయన్ని పరిచయం చేశాడు. నలభై పైబడ్డా, ఆయనకి కథలంటే మంచి వుత్సాహం. ఇదివరలా ఇప్పుడు వ్రాయకపోయినా, మంచి అనుభవస్తుడు కనుక, రచయితలకి సలహాలు అవి ఇస్తూంటాడు.

''కొత్తకథ లేమైనా వ్రాసారా?'' అడిగాడాయన పరిచయాలయాక అంబాజీరావుని.

''లేదు సార్. కానీ ఓ మంచి కథని చదివాను. స్పేనిష్ కథలు ఇంగ్లీషులోకి అనువదింపబడ్డాయి. ఆ కథల సంపుటిని మా ఆఫీస్ లైబ్రరీకోసం కొన్నారు కొత్తగా. ఆ కథల సంపుటిలో ఓకథ నాకు బావుంది.''

''ఏం కథ అది?'' అడిగాడాయన.

ఆయన భార్య పిలిస్తే లోపలికి వెళ్ళి నాలుగైదు నిమిషాలలో రెండు గ్లాసులతో వచ్చాడు.

''తీసుకోండి'' అన్నాడు అప్యాయంగా.

నిమ్మకాయ నీళ్ళు

''థాంక్స్'' అన్నాను.

''నిమ్మకాయ నీళ్ళకి మంచి కథ చెప్పండి''అన్నాడాయన నవ్వుతూ అంబాజీ రావుతో.

ఓకథని చెప్పాడు అంబాజీరావు, నేను ప్రక్కనే వున్న సినిమా పత్రిక తిరగే స్తుంటే.

''వండ్రఫుల్! చాలా బాగుంది'' మెచ్చుకుని, కొంచెం సేపాగి అన్నాడాయన మళ్ళీ, ''మన తెలుగు కథ ఈ స్థాయికి ఎప్పుడు ఎదుగుతుందో-ఎన్నోకథ లొస్తున్నాయి.కాని అన్ని చప్పగా వుంటున్నాయి. ఇంకోభాష లోకి తర్జుమాచేయతగ్గ దనిపించే కథలు మనకి చాలా తక్కువ.

ఒంటి గంటదాక ఆయనింట్లోనే కూర్చుని తిరిగి గదికి వచ్చాం. నేను ప్రక్కమీద చేరాను నిద్రాదేవిని ముద్దు పెట్టుకుని కౌగ లించుకోవాలని. అంబాజీరావు తెల్లకాగితం కింద కార్బన్ కాపీ బిగించి రచనా వ్యాసం గంలోకి జారిపోయాడు, నేను నిద్రలోకి జారక ముందే.

* * *

''నువ్వొట్టి దొంగవి'' అరిచాను అంబాజీ రావుని. కథ స్వంతంగారాసే శక్తి లేక పోతే వూరుకోవాలి గాని, పరభాషలలోని కథలని దొంగతనం చేస్తావా ?''

''ఏమిటీ'' కొద్దిగా బిత్తరపోయాడు అంబాజీరావు. ''నేను కథని దొంగతనం చేసానా ?'' అన్నాడు.

''లేకపోతే'' ఇది నువ్వు దొంగిలించిన కథ కాదా!'' అని చేతిలోని పత్రికని అంబాజీరావు వైపు విసిరేసాను.

పుస్తకం మీద ముఖచిత్రం చూసి అందులో ప్రచురింపబడ్డ తన కథని గుర్తు తెచ్చుకు న్నాడు అంబాజీరావు క్షణాలలో.

''ఇందులో ప్రింటయిన కథ చదివావా?దీని మీదేనా నీ ఆరోపణ!'' అడిగాడు సంది గ్ధంగా.

''అవును 'సమర్పణ' నీ స్వంత బుర్ర లోంచి పుట్టివచ్చిన కథకాదు''

''నాదే''

''అబద్ధం నిలవదోయ్. ఇది స్పేనిష్ భాషలోంచి ఇంగ్లీషులోనికి అనువాదం చేయ బడినకథ. అవునా?''

''ముమ్మాటికి కాదు. నా స్వంతరచన'' అన్నాడు కొద్దిగా ఆశ్చర్యంగా.

''వెధవన్నర వెధవ, నన్ను మోసం చేయలేవు. ఒక ఆదివారం నీవెంటవస్తే, ఓ రచనతవ్వి ఆయనింట్లో ఈ కథ చెప్పావ్. నేనా సంగతి మర్చిపోలేదు. అప్పుడే చెప్పావ్ ఇది స్పేనిష్కథని.''

అంబాజీరావు పకపకనవ్వాడు వెంటనే.

''దేనికి ఇంకా సిగ్గులేక? ఇలా కాపీ కొడితే నేనూ రచయితనవగలను తెలుసా?''

''నీకోసంగతి తెలియదయితే'' అన్నాడు నవ్వాపుకుంటూ.

''తెలుసు, నీలా అంతా కాపీ రచయితలు కాదు.''

''అక్కడే పొరబడ్డావ్''

''అయితే తెలుగులో రచయితలం......

''అలాగే, ఇక్కడో చిన్నకిటుకుంది. నేను వ్రాసిన కథని ఎప్పుడూ నా రచనగా చెప్పను ఏరచయితకీ. ముఖ్యంగా మనం వెళ్ళిన రచయితకు ''సోవియెట్ లేండ్'' లో

నేను చదివిన కథగానో, జర్మన్‌కథల అనువాద సంకలనంలో చదివినాననో చెప్తాను నాకథని.''

''అంటే అబద్ధంగానా!

''మరో రచయిత కథగా చెప్తే ఆ కథలో బాగోగులు, ఎలావ్రాసివుంటే ఇంకా మంచి కథయేది, ఆ కథలోని మంచి అంశాలేమిటి వగైరాలు నిర్మొహమాటంగా చెప్తాడాయన. అదే నేను వ్రాసిన కథ అని చెప్తే, మొహమాటం అడ్డుపడి 'మంచికథ' అనేస్తాడు; విమర్శించడానికి భయపడతాడు. ఇంతకంటే మరేంలేదు. ఆసంగతి ఆయనకూ తెలును.''

ఆశ్చర్య పడ్డాను నేను.

''నిజానికి ఈ ఏర్పాటు ఆయనే చేసారు. నాలాంటి చిన్నరచయితలకు ఆయన తరచూ సలహాలు ఇస్తూంటాడు. ఆయన ఎంత సహృదయుడో అంత మొహమాటస్థుడు మరి.''

''ఫన్నీ. ఇట్ లుక్స్ ఫన్నీ ఇండీడ్'' అన్నాను నేను.

## పరిపూర్ణ పఠనానందం ప్రజాతంత్ర చదవడం!


# పుస్తక రూపంలో సమాజానందస్వామి

ప్రజాతంత్ర పాఠకుల ఆదరణను
విశేషంగా చూరగొన్న
సమాజానందస్వామి
కార్టూన్ కవితల తొలి సంపుటి
చంద్ర బొమ్మలతో
పుస్తక రూపంలో వెలువడింది.
ఖరీదు మూడు రూపాయలు
పోస్టు ఖర్చులు అదనం
ప్రతులకు: ఝరీపొయెట్రీ సర్కిల్
B59/F1, విజయనగర్ కాలనీ
హైదరాబాదు-500057.

